క్లుప్తంగా

టై, బెల్టుల పంపిణీ



మహాముత్తారం : మండలంలోని యామన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం ప్రధానోపాధ్యాయులు తిరుపతి, ఉపాధ్యాయులు టై, బెల్టులు పంపిణీ చేశారు. తన స్నేహితులు, శ్రీహన్, శ్రీనివాస్ సహకారంతో రూ. 3వేల విలువచేసే టై, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు తిరుపతి, విజయ్‌కుమార్, మంజుల, సీఆర్పీ బాపురెడ్డి తదితరులు ఉన్నారు.

బాలిక అదృశ్యం

మహదేవపూర్ : మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం అయినట్లు బుధవారం ఎస్సై ప్రసాద్ తెలిపారు. సోమవారం పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికారు. అయినా ఆచూకీ లేకపోవడంతో బుధవారం బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



మొగుళ్లపల్లి : మండలంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం భూపాలపల్లి డీఎస్పీ రాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే వారి పట్ల గౌరవంగా ఉండాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై మాధవ్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



భూపాలపల్లి అర్బన్ : తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఇంటర్ విద్య నోడల్ ఆఫీసర్ కార్యాలయంలో అధికారి దేవరాజం బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొజ్జ అనిల్‌కుమార్, సదాశివ్, సమ్మయ్య, సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



గోవిందరావుపేట : మండల కేంద్రంలోని పస్రా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. మంత్రి సీతక్క మిని అంగన్‌వాడీ కేంద్రాలను, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మారుస్తూ మొదటి సంతకం చేశారని, ఆసియాలోనే అతి పెద్ద గిరిజన మేడారం జాతరకు రూ.75 కోట్లు మంజూరు చేయించారన్నారు. భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలానికి అంతర్గత రోడ్ల కోసం రూ.2.50 కోట్లు సీసీరోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాలడుగు వెంకటకృష్ణ, రసపుత్ సీతారాం నాయక్, పన్నాల ఎల్లారెడ్డి, దాసరి సుధాకర్, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, పులుగుజ్జు వెంకన్న, పెండెం శ్రీకాంత్, నాగేందర్ రావు, కృష్ణ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని ముకునూరు పాలెంలో బుధవారం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులను వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై రేక అశోక్ పంపిణీ చేశారు. కందిపప్పు, నూనె, పసుపు, వంట పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ బండారి కుమార్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి సంస్థ సాయం చేయడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు, మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు, ఇందిర, పద్మ, ఉషాతోపాటు తదితరులు ఉన్నారు.

విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఉండాలి

కాటారం : విద్యార్థినులు ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి చల్లా సునీత అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల, కళాశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పలు రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు మెడల్స్ బహూకరించారు. గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్(జీ.సీ.ఈ.సీ) ఏర్పాటు చేశారు. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాలపై తొమ్మిదో తరగతి విద్యార్థిని వర్షిణి బృందం ప్రదర్శించిన స్కిట్ కంటతడి పెట్టించింది. ఈ సందర్భంగా ఎస్‌ఓ మాట్లాడుతూ.. బాలికలు, బాలురతో సమానంగా విద్యార్థి దశ నుంచే అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, రాజమణి, విజయ, కవిత, నళిని, లక్ష్మి, శిరీష, నాజియా, దివ్య, మణిమాల, సరిత, స్వప్న, శ్రీలత, పీఈటీ రాజేశ్వరి, ఏఎన్ఎం లక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.



కాటారం: విద్యార్థినులకు మెడల్స్ అందజేస్తున్న ఎస్‌ఓ సునీత, ఉపాధ్యాయులు

అఘాయిత్యాలను అరికట్టాలి

కాళేశ్వరం : బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలను అరికట్టాలని పలుగుల అంగన్‌వాడీ-2 టీచర్ ఒద్ది ఉమామహేశ్వరి అన్నారు. బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులతో పాటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్లకార్డులతో ఆడపిల్లను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదవనిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కాళేశ్వరం: పలుగులలో ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న విద్యార్థులు

సమష్టి కృషితోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

గణపురం : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. మండలంలోని చెల్పూరులోని ఓ గార్డెన్‌లో బుధవారం మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అధిష్టానం సూచించిన వ్యక్తికి భూపాలపల్లి నియోజక వర్గంలో అత్యధిక మెజార్టీ అందించి గెలిపించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని తనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్ని రకాలుగా సహకరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సహకరించిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పగా కాపాడుకుంటానని అన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు,

నివేదికలు సిద్ధం చేయాలి

మంగపేట : 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న ఉపాధిహామీ పనులపై నివేదికలు సిద్ధం చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుదర్శన్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల వారిగా ఉపాధి పనుల నివేదికలు సిద్ధం చేసి అందించాలని అన్నారు.



మాట్లాడుతున్న సుదర్శన్

ఏపీడీ వెంకటనారాయణ, ఏపీఓ సునీత, ఎంపీఓ మమత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లి పాలే శ్రేయస్కరం



మొగుళ్లపల్లి : సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మొగుళ్లపల్లి : పిల్లలకు తల్లి పాలే శ్రేయస్కరమని శిశువు పుట్టిన గంటలోపు తల్లి పాలు అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో సీమంతాలు, అక్షరభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడారు. పుట్టిన శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తల్లి పాలలో రోగ నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందన్నారు. తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందించాలన్నారు. రక్తహీనతతో ఉన్నా తల్లులు ఎక్కువ పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వెన్నెల, ఆయా దమయంతి, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలకు సూచనలిస్తున్న సీడీపీఓ అవంతి

పిల్లలను అంగన్‌వాడీకి పంపించాలి

టేకుమట్ల : తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని సీడీపీఓ అవంతి కోరారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని రామకృష్ణాపూర్ (టి) ఎమ్మార్సీ భవన్‌లో అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అవంతి హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలను తీసుకవచ్చే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించిన విషయాలను టీచర్లకు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సరోజన, సంధ్యారాణి, 45 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణ జాగ్రత్తగా చేపట్టాలి

కాటారం : గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణ జాగ్రత్తగా చేపట్టాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నర్సరీల నిర్వాహణపై బుధవారం ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. నర్సరీలలో బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాలు నాటే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విత్తనాలు నాటిన బ్యాగ్‌లకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వాటరింగ్ చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని, హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు పూర్తి స్థాయిలో ఎదిగేలా చూడాలని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు గుర్తించాలి..

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన గుర్తించాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బీపీ, డీపీ, బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై శనివారం లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులపై చర్చించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను శాఖల వారిగా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, ఏపీఓ వెంకన్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అరుణ, వీణ, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఆర్థిక ప్రణాళిక రూపకల్పన

పలిమెల : వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024–25) మండలంలోని చేపట్టాల్సిన పనులను గుర్తించి ఆర్థిక ప్రణాళిక (బడ్జెట్ ప్లాన్) రూపొందించడం జరిగిందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో జీపీ, డీపీ, బ్లాక్ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీఓ శ్రీనివాస్ మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి ప్రకాశ్ రెడ్డి, సీడీపీఓ రాధిక, ఏపీఎం రవికుమార్, అగ్రికల్చర్ ఏఈఓ పృథ్వీ, హెల్త్ సూపర్‌వైజర్ మసూద్, ఈసీ శ్రీకాంత్, పీఆర్, మిషన్ భగీరథ ఏఈలు పాల్గొన్నారు.



కాటారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



టేకుమట్ల : మాట్లాడుతున్న వైద్యాధికారి ఆశాజ్యోతి

టేకుమట్ల : ఎదిగే బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలికల ఆరోగ్యానికి ఆకుకూరలు, పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయమం చేయాలని, సమయపాలన పాటించి భోజనం చేయాలని సూచించారు. ఆహారంలో న్యూట్రిన్, పోషకాలు ఎక్కువగా ఉండే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహదేవపూర్ : కేజీబీవీలో విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్యశిబిరం

మహదేవపూర్ : మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో డాక్టర్ సుష్మిత ఆధ్వర్యంలో బుధవారం రక్తహీనత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుష్మిత మాట్లాడుతూ.. విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి తగిన పోషకాహారం తీసుకోవాలని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గణపురం : మండలంలోని మాధవరావుపల్లి ఓసీ-3 ప్రాజెక్టులో లోడర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మామిడి పవన్(34) ప్రమాదవశాత్తు ఈ నెల 16న బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా బుధవారం మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన మామిడి పవన్ ఓసీ-3 ప్రాజెక్టులో లోడర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 16వ తేదీన విధులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో ఓసీ-3 ప్రాజెక్టు ప్రధాన గేటు వద్ద తన ద్విచక్ర వాహనం పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే పవన్‌ను చికిత్స నిమిత్తం సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గణపురం ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

కాటారం : ఒంటరితనం భరించలేక జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం గుమ్మాళ్లపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మాళ్లపల్లికి చెందిన చల్ల మల్లయ్య (60)కు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహం కాగా కుమారుడు స్థానికంగా ఉండడం లేదు. భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందగా మల్లయ్య ఒంటరిగా జీవిస్తున్నాడు. ఇదే క్రమంలో ఒంటరితనంతో తీవ్ర మనస్థాపానికి గురైన మల్లయ్య ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం అటువైపుగా వెళ్లిన వారు మల్లయ్య ఉరి వేసుకున్నట్లు గమనించి స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహదేవపూర్ సామాజిక వైద్యశాలకు తరలించారు. మృతుడి కూతురు వేమునూరి అనసూర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

కాటారం : మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై అభినవ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి ఎస్సై వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురై కుటుంబాలకు దూరం కావాల్సి వస్తుందన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కేసుల పాలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. ఎస్సై వెంట సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు ఉన్నారు.



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న ఎస్సై

పరామర్శ



పరామర్శిస్తున్న మిట్టపల్లి సురేందర్

టేకుమట్ల : మండలంలోని రామకృష్ణాపూర్ (వి) గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు తండ్రి ఆడగాని కిషన్‌రావు(55) అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను సినీ గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పుల్ల సతీష్‌కుమార్, బొజ్జపల్లి శంకర్, అందె కుమార్, మిట్టపల్లి బాలు, ఆరే దేవేందర్, బొయిని తిరుపతి, ఎండి అక్రం, పాల శంకర్, ఐలన్న, మహేందర్, దప్పు సత్తి, రాము, రమేష్, రాజేందర్, సదయ్య, సతీష్ తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

మహాముత్తారం : మండలంలోని గాజరాంపల్లి గ్రామానికి చెందిన కోడి మధునమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, బుధవారం బోర్లగూడెం మాజీ సర్పంచ్ రజిత సుగుణాకర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం 25కేజీల బియ్యం, నగదు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, దేవయ్య, పవన్ తదితరులు ఉన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ

మహాముత్తారం : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం సీనియర్, జూనియర్ కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు లావుడ్య ప్రకాష్, పీఈటీ విజయలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

గోవిందరావుపేట : వైఆర్‌జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని చల్వాయి పంచాయతీలో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా వైఆర్‌జీ కేర్ సంస్థ లింక్ వర్కర్ టి.కిషన్ హాజరై మాట్లాడారు. చల్వాయి గ్రామంలో ప్రతి ఒక్కరికి ఎయిడ్స్ (హెచ్ఐవీ), సుఖ వ్యాధుల పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎవరికైనా సందేహం ఉంటే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్ష, టీబీ పరీక్ష, సుఖ వ్యాధుల పరీక్షలు చేయించుకోవాలి అని అన్నారు. ఉప సర్పంచ్ తేళ్ల హరి ప్రసాద్, కార్యదర్శి భారతి, అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ ఆరుంధతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైర్ చోరీ



దుండగులు పగలగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

కాటారం : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. మండలంలోని ధన్వాడ, పరికిపల్లి గ్రామాల్లోని ఆయా రైతుల పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్‌ను దుండగులు దొంగలించారు. ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులోని కాపర్‌వైర్‌ను ఎత్తుకుపోయారు. అది గమనించిన రైతులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ట్రాన్స్‌కో ఏఈఈ మేఘనాథ్ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాపర్‌వైర్ కోసం దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొడుతుండటంతో విద్యుత్ సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దుండగులు పొలాల్లో, గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్లనే టార్గెట్ చేస్తూ కాపర్‌వైర్ దొంగలిస్తున్నారు. సుమారు 5 నుంచి 8 మంది ఓ ముఠాగా ఏర్పడి ముందస్తు ప్రణాళిక ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా తొలగించి వెంట తెచ్చుకున్న సామగ్రితో ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి కాపర్‌వైర్‌ను కాజేస్తున్నట్లు తెలిసింది. అలా పోగు చేసిన కాపర్‌వైర్‌ను మంచిర్యాల, బెల్లంపల్లి ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా మంచిర్యాల, బెల్లంపల్లి ప్రాంతానికి చెందిన కొందరు కాపర్ కొనుగోలు వ్యాపారులు ఈ ప్రాంతానికి చెందిన కొందరు ఆకతాయిలకు అడ్వాన్స్‌గా డబ్బులు సమకూర్చి కాపర్‌వైర్ చోరీకి ప్రోత్సహిస్తున్నట్లు తెలిసింది. కాటారం, మల్హర్, మహదేవపూర్ మండలాల్లో పలు చోట్ల పెద్ద ఎత్తున కాపర్‌వైర్ చోరీకి పాల్పడిన దుండగులను పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేసి జైలుకు పంపించిన సంఘటనలు ఉన్నాయి. కాటారం మండల కేంద్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తు కేంద్రంలో దుండగులు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది కళ్లుగప్పి పెద్ద మొత్తంలో కాపర్‌వైర్ దొంగలించగా పోలీసులు విచారణ చేపట్టి దుండగులను చాకచక్యంగా పట్టుకున్నారు. గత కొన్ని నెలలుగా కాపర్‌వైర్ చోరీలకు ఫుల్‌స్టాప్ పెట్టిన దొంగలు తిరిగి చోరీలు ప్రారంభించడంతో రైతులు, విద్యుత్‌శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. పంట సాగు చేసే సమయం దగ్గర పడుతుండటంతో ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు టార్గెట్ చేస్తుండటంతో రైతులు తిరిగి ట్రాన్స్‌ఫార్మర్లు పొందడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కాపర్ వైర్ చోరీలకు అడ్డుకట్ట వేసి దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని వారు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో దొంగలు.?

కాటారం, మహదేవపూర్ మండలాల్లో కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులను మహదేవపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఓ గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కాపర్‌వైర్ చోరీకి యత్నిస్తున్న దుండగులు అటువైపుగా పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించినట్లు సమాచారం. పోలీసులు దుండగుల్లో ఒక్కరిని అదుపులోకి తీసుకొని విచారించగా మిగితా దుండగుల సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాపర్‌వైర్ చోరీకి పాల్పడుతున్న దుండగులు కాటారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వారని తెలియవచ్చింది. ఇటీవల చేసిన కాపర్‌వైర్ చోరీలు అన్ని వీరే చేశారా..దొంగలించిన కాపర్‌వైర్‌ను ఎక్కడ విక్రయిస్తున్నారు..ఎలా రవాణా చేస్తున్నారు..వీరితో పాటు ఇంకెవరెవరికి ఇందులో భాగస్వామ్యం ఉందనే అంశాలపై పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

రేగొండ : వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు మండలంలోని అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ స్వామి ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అర్హులు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2020 నవంబర్ 1, నాటికి డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన పట్టభద్రులు అర్హులన్నారు. గతంలో ఓటరుగా తమ ఓటు నమోదు చేసుకున్నప్పటికీ మళ్లీ నమోదు చేసుకోవాలని తెలిపారు.

చిట్యాల : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సుమన్ బుధవారం ప్రకటనలో తెలిపారు.

మొగుళ్లపల్లి : వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు అర్హత కలిగిన పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సునీత బుధవారం ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 6లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ లేదా ఫారం-18ను పూర్తి చేసి దరఖాస్తును తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు.